ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 20 | ఏప్రిల్ | 2024
పేజీలు 5

## ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలి




వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్, శంకర నంద్

2 లో

# ఛత్తీస్‌గఢ్‌లో ఐఇడి పేల్చిన మావోయిస్టులు

- ఎన్నికల వేళ స్ట్రాంగ్ వార్నింగ్
- బిఎస్ఎఫ్ జవాన్‌కు తీవ్రగాయాలు





**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్నికల వేళ మావోయిస్టులు ప్రతీకార చర్యకు పాల్పడ్డారు. గత నాలుగు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విధితమే. కాగా బస్తర్ లోక్‌సభ స్థానానికి ఎన్నిక జరుగుతున్న వేళ మావోయిస్టులు ఒక్క సారిగా ఐఇడి బాంబు పేల్చి భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఈ ఘటనలో బిఎస్ఎఫ్ జవాన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ జావన్‌ను హెలీకాప్టర్ ద్వారా మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. అనుకోని ఈ ఘటనతో ఒక్కసారిగా అలజడి మొదలైంది. దీంతో ప్రమత్తమైన బలగాలు భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్న వరుస ఎన్‌కౌంటర్లలో సుమారు 70 మంది మావోయిస్టులు మృత్యువాత పడిన 24 గం.ల అనంతరం స్పందించిన మావోయిస్టు పార్టీ ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, పూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయకులను పోలీసులు హతమారుస్తున్నారని మావోయిస్టు పార్టీ గడిచిన రెండు రోజుల్లో కరపత్రాలు విడుదల చేయడంతో పాటు బ్యానర్లు సైతం వేశారు. పలు భారీ వృక్షాలను నరికి రోడ్లకు అడ్డంగా వేయడంతో పాటు, కందకాలు తవ్వారు. దీంతో అప్రమత్తమైన బలగాలు ఎన్నికలు జరుగుతున్న బస్తర్ లోక్‌సభ స్థానంతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వ్యాప్తంగా హై అలెర్ట్ ప్రకటించారు. ల్యాండ్ మైన్లు అమర్చి విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని గ్రహించిన భద్రతా బలగాలు అనువనువుగా గాలింపు చర్యలు చేపట్టారు. అడవుల్లోకి పెద్ద ఎత్తున కూంబింగ్ వెళ్లిన పార్టీలు సైతం అచీతూచి ముందుకు సాగుతున్నాయి. సుమారు 70 మంది సహజరులను కోల్పోయిన మావోయిస్టులు ప్రతీకారం రగిలిపోతుండటంతో ఏ క్షణంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయో అంతుపట్టక అటవీగ్రామాల ప్రజలు భయాందోళనతో వణికిపోతున్నారు. ఐదు రాష్ట్రాల సరిహద్దులను స్వాదీనం చేసుకున్న బలగాలు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తూ ఆరా తీస్తున్నారు.

## మున్నేరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

-కాంక్రీట్ పనులను త్వరగా పూర్తి చేయాలి
-కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్నేరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఈ సందర్బంగా వారికి పలు సలహాలు, సూచనలు అందించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ వర్షాకాలం రాక ముందే మున్నేరులో కాంక్రీట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కేబుల్ బ్రిడ్జి వద్ద నీటి నిల్వ కొరకు ఇరిగేషన్ శాఖ తో సమన్వయం చేసుకుంటూ చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ డ్యాంలు నిర్మిస్తే భూగర్బ జలాలు పెరగడంతో పాటు పర్యావరణ పరంగా ఉపయోగపడు తుందన్నారు. పాత బ్రిడ్జిని కూడా సుందరంగా తీర్చిదిద్ది ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మంత్రి తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులను సంప్రదించి వారి సలహాలు, సూచనల ప్రకారం తగు చర్యలు తీసుకోవాలన్నారు. మున్నేరుకు ఇరువైపులా కొత్తగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నందున ఆ నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ కేబుల్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

# నామ గెలుపు.. చారిత్రాత్మకం అవుతుంది

-కుటుంబ పాలన అన్నవారు ఇప్పుడు టికెట్ల కోసం ప్రయత్నం
-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
-బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని గడప గడపకు తీసుకెళ్లాలి : ఎంపి నామ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపు చారిత్రాత్మకం అవుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గతంలో కుటుంబ పాలన అంటూ బిఆర్ఎస్ పై ఆరోపణలు చేసిన వారు ఇప్పుడు వారి కుటుంబంలోని సభ్యులకు టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఖమ్మం బిఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం నియోజక వర్గ స్థాయి సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సందర్బంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ నామ నాగేశ్వరరావును బిఆర్ఎస్ అభ్యర్థిగా కేసిఆర్ నిర్ణయం తీసుకున్నారని వారి విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ఇంత వరకు అభ్యర్థినే ప్రకటించ లేదన్నారు. జిల్లాలో ఉన్న ఓ మంత్రి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని చూస్తుందని గతంలో ఈ నాయకులే కుటుంబ పాలన గురించి బిఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారన్నారు. కేసిఆర్ కుటుంబం మొత్తం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, అభివృద్ధికి కృషి చేసిన చరిత్ర ఉందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చే కుటుంబ సభ్యుల పాత్ర తెలంగాణ ఉద్యమంలో కానీ, అభివృద్ధిలో కానీ ఏమైనా ఉందా అని

మిగతా 2లో..

# తెలంగాణ ఏర్పాటులో బిజెపిది కీలక పాత్ర



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషించిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. బిజెపి మోడీ ప్రభుత్వం చెప్పింది చేస్తుందని మంత్రి

మిగతా 2లో..

-మోడీ ప్రభుత్వం చెప్పింది చేస్తుంది
-వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
-కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గ వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రాలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యయ పరిశీలకులు, ఖమ్మం నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ఖర్చు నిఘా బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని తెలిపారు. డబ్బు, మద్యం, ప్రలోభాల రహిత ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాలపై నిఘా ఉంచాలన్నారు. డిజిటల్ లావాదేవీలు, అనుమానాస్పద లావాదేవీలను తనిఖీలు చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్ఎస్టి ల ప్రదేశాలు మార్చుతూ ఉండాలన్నారు. జప్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెద్ద మొత్తంలో నగదు జప్తు జరిగినప్పుడు ఐటి శాఖకు సమాచారమిచ్చి నియమ నిబంధనలను పాటించాలన్నారు. విదేశీ కరెన్సీ పట్టుబడినప్పుడు ఇడికి సమాచారమివ్వాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలు పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్ ప్రచురణ కర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం 127 ఎ ప్రకారం నిబంధనలను పాటించాలన్నారు. ఎంసిఎంసి ద్వారా ఎన్నికలలో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయ నమోదు చేయాలన్నారు. ఎంసిఎంసి కమిటీ ద్వారా రోజు వారి దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్ పై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియాపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టిలు తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఖమ్మం నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయన్నారు. 24 ఫ్లయింగ్ స్క్వాడ్, 45 ఎస్ఎస్టి టీములు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి సి విజిల్, 1950 టోల్ ఫ్రీ ఫిర్యాదుల పరిష్కారం , నిఘా బృందాల పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. సువిధ సింగిల్ విండో ద్వారా ఎన్నికల సంబంధ అన్ని అనుమతులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ 155 దరఖాస్తులు రాగా 109 పరిష్కరించినట్లు 22 తిరస్కరణకు గురికాగా రెండు పరిశీలనలో 14 పెండింగ్‌లో, ఎనిమిది దరఖాస్తులు రద్దయినట్లు తెలిపారు. సాధారణ పౌరులకు ఇబ్బందులు కలుగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అనుమానాస్పద ఎన్నికల ప్రభావానికి వినియోగిస్తారనే అనుమానితాలపై చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 12 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహనాన్ని తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక పోలీసులు తనిఖీలు చేస్తున్నారని పోలింగ్ కు ముందు డ్రైడే నాడు మిర్రర్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, శిక్షణ నోడల్ అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ వ్యయ నిఘా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పాటులో బిజెపిది కీలక పాత్ర

**(మొదటిపేజీ తరువాయి)**



తెలిపారు. ఖమ్మం పార్లమెంటు బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం నగరంలో నిర్వహించిన రోడ్డు షోలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. సర్దార్ పటేల్ మైదానం నుంచి మయూరిసెంటర్ వరకు రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా కుంభకోణాలే జరిగాయన్నారు. మోడీ పదవి కాలంలో ఒక కుంభకోణం కూడా జరగలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బిజెపి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధనకు పార్లమెంటులో సహకరించిందన్నారు. మోడీ ప్రభుత్వం చెప్పింది చేస్తుందని కశ్మీర్‌లో 370 యాక్ట్ తీసుకు వచ్చి భారతదేశంలో కలిపిందని, అయోధ్యలో రామ మందిరం నిర్మించిందన్నారు. ముస్లిం అయినా, క్రిస్టియన్ అయినా ఎవరైనా మహిళలను గౌరవిస్తూ త్రిబుల్ తలాక్ తెచ్చామన్నారు. ఈసారి బిజెపి ప్రభుత్వం వస్తే యూనిఫాం సివిల్ కోడ్ తెస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ వల్ల పేదరికం పెరిగిందని మోడీ పాలనలో పేదరికం తగ్గిందన్నారు. యావత్ ప్రపంచం మొత్తం భారతదేశం ఏమి మాట్లాడుతుంది అని చూస్తుందన్నారు. 2014లో మోడీ ప్రభుత్వం రాక ముందు దేశ ఆర్థిక వ్యవస్థ 14వ స్థానంలో ఉందని ఇప్పుడు ఐదవ స్థానంలోకి వచ్చిందన్నారు. ఉక్రేయిన్, రష్యా ల మధ్య యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న మన విద్యార్థులను తీసుకు రావడానికి రష్యా అధ్యక్షునితో చర్చలు జరిపి క్షేమంగా తీసుకు వచ్చామన్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీం తీసుకు వచ్చి ప్రజలకు ఐదు లక్షల ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. మోడీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని తద్వారా తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. బిజెపి అభ్యర్థి వినోద్‌రావు ఎటువంటి మచ్చలేని డైనమిక్ అభ్యర్థి అని తెలిపారు. కమలం గుర్తుకు ఓటేసి వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, బిజెపి రాష్ట్ర నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, శ్రీధర్ రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నామ గెలుపు చారిత్రాత్మకం అవుతుంది



**(మొదటిపేజీ తరువాయి)**

ప్రశ్నించారు. ప్రజలు ఒక సారి ఆలోచించాలన్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చాయని ఎన్నికల్లో గెలుపోటములు సహజమని పెద్ద పెద్ద నాయకులే ఓడిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక మందికి పార్టీ పదవులు ఇచ్చిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కొందరు పదవులు అనుభవించి ఇప్పుడు బయటకు పోయారని వారి వాళ్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటుతుందని ఎనిమిది పార్లమెంటు స్థానాలు గెలుపొందుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి రాబోయే ఎన్నికల్లో నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

**అభివృద్ధి, సంక్షేమాన్ని గడపకు గడపకు తీసుకెళ్లాలి : నామ**



బిఆర్ఎస్ హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గడప గడపకు తీసుకెళ్లాలని ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. కేసిఆర్ ఆశీర్వాదంతో బి పాం తీసుకుని మీ ముందుకు వచ్చానని తెలిపారు. జిల్లా ప్రజలు ప్రతిసారి తనను ఆశీర్వదించారని దీనికి కారణం కార్యకర్తలు వారి శ్రమ అని వారి రుణం ఎప్పటికీ తీర్చుకో లేనన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారని కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో పదేళ్లు పార్లమెంటులో ఉన్నానని ఎప్పుడు జిల్లా అభివృద్ధి కోసమే ఆలోచించానన్నారు. లోక్‌సభ పార్లమెంటు నాయకునిగా తెలంగాణ పక్షాన నిధులు, విభజన హామీల కోసం గళం విప్పానన్నారు. కాంగ్రెస్, బిజెపి ఎంపిలు తెలంగాణ పక్షాన ఏ రోజు గళం విప్పలేదన్నారు. పార్లమెంటులో తెలంగాణ గళం వినపడాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక కాంగ్రెస్ బిఆర్ఎస్ పై నిందలు వేస్తుందన్నారు.

**కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది : ఎంఎల్‌సి తాతా మధు**



కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ తెలిపారు. జిల్లాలో ప్రజలు మళ్లీ కేసిఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని కోరారు. కేసిఆర్ ఇచ్చిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలు ప్రశ్నించాలన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నీటి ఎద్దడి ఎప్పుడు రాలేదని నాలుగు నెలల్లోనే అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. పార్లమెంటులో తెలంగాణ గళాన్ని వినిపించిన నామ నాగేశ్వరరావును మరోమారు గెలిపించాలని ఆయన కోరారు.

**ఘనంగా మాజీ మంత్రి పువ్వాడ పుట్టిన రోజు :**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ ఖమ్మం నగర కమిటీ అధ్యక్షులు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో పువ్వాడ అజయ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. సర్వమత ప్రార్థనలు చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఎంపి నామ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పలువురు నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# పల్లెల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోండి



**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** పల్లెల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు ముగింపు నాటికి పూర్తి చేయాలని అడిషనల్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం నేలకొండపల్లి మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖ, పంచాయితీ, ఐకెపి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలోని పలు విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో పాఠశాలల ముగింపు నాటికి పనులు శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లెల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైతే మంచినీటి వనరులను అద్దెకు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి ఎంపిడివో ఎం. యర్రయ్య, మండల పంచాయితీ అధికారి సిహెచ్ శివ, మండల విద్యాశాఖాధికారి బి. రాములు, ఐకెపి ఏపియం అశోక్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# దాడికి కుట్ర పన్నిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పై దాడికి కుట్ర పన్నిన వారిపై కఠిన చర్యలు తీసుకుని పిడియాక్ట్ నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని అల్లిపురంలో కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయంగా చైతన్యవంతమైన ఖమ్మంజిల్లాలో ఇప్పటి వరకు ఫ్యాక్షన్ చరిత్ర లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఆదర్శవంతమైన రాజకీయ నేతగా కొనసాగిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై కుట్ర పూరితంగా దాడికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుమ్మల నాగేశ్వరరావును ఎదుర్కొనలేక మాజీ మంత్రి ఓ పోలీస్ అధికారితో కలిసి తుమ్మలపై దాడి చేసేందుకు కుట్ర పన్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తుమ్మల నాగేశ్వర రావు ఏ ఒక్కరిపై కక్షలు పెంచుకోవడం, కేసులు పెట్టించడం చేయలేదన్నారు. కాంగ్రెస్ నాయకులపై పిడి యాక్ట్ కేసులు పెట్టించిన ఘనత మాజీ మంత్రికి ఉందన్నారు. కుట్రకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, వివిపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, మాజీ కార్పొరేటర్లు చావా నారాయణరావు, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, పాలెపు లక్ష్మి, విజయనిర్మల, నాయకులు పోట్ల వీరేందర్, మందడపు మనోహర్, నల్లమల ఆనంద్, ఆశ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలపై దాడి కుట్రదారులను వెంటనే అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాడి చేసేందుకు చేసిన కుట్ర దారులను వెంటనే అరెస్టు చేయాలని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల పై దాడి చేయాలని కుట్ర పన్నిన వాళ్లెవరో త్వరగా విచారించి ఆ కుట్ర దారులు ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తుమ్మల రాజకీయ జీవితం లో ఒకరికి హాని చేయటం తెలియని వ్యక్తి పై దాడి చేసేందుకు పథకం పన్నటం చాలా దుర్మార్గమన్నారు. నేలకొండపల్లి మండలంలోని మామిడితోట బాగోతం బయట పెట్టాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్‌లో పాత్రదారులు, సూత్రదారులు అందరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, బూట్లు ఎక్కడ?

**ప్రజాపక్షం/వైరా:** మున్సిపాల్ కార్మికులకు కనీస సౌకర్యాలు అందడం లేదు. మండుటెండలో కార్మికులు వారి పనులను నిర్వర్తిస్తున్నారు. డ్రైనేజీలో పూడిక తీసేటప్పుడు కనీసం పారిశుద్ధ్య కార్మికులకు చేతికి గ్లౌజులు, కాళ్లకు బూట్లు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలుషితమైన డ్రైనేజీ వాటర్‌లో కాళ్లతో దిగడం వలన కాళ్ళకు రకరకాల రూపంలో వచ్చే బొబ్బలతో ప్రమాదం కూడా లేకపోలేదు. శుక్రవార వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న సమయంలో వారి కాళ్ళకు ఎలాంటి బూట్లు గ్లౌజులు కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, బూట్లు ఇచ్చి వారి ఆరోగ్యానికి బాసటగా నిలవాలి.





# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాల బోడి మల్లె పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, మరుగుదొడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణము విశాలమైన ఆవరణలు మౌలిక వసతులను పరిశీలించారు. మౌలిక వసతులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పులి సాంబశివుడు, అన్వర్, స్టాలిన్ సిబ్బంది పాల్గొన్నారు.



## సమర్ధవంతమైన వ్యక్తికే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం జిల్లా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా బిఆర్ఎస్ పార్టీ మనుగడకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రస్తుతం ఉన్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధు దళితబంధు అమ్ముకునే వ్యక్తి. అలాగే అతను పార్టీని అభివృద్ధి చేయాలని ఆలోచన లేని వ్యక్తి అని నియోజకవర్గాల్లో గ్రూపులను ప్రోత్సహించే వ్యక్తి ద్యమాలు చేసే ఉన్న వ్యక్తి ఉంటే ఆయనకు పార్టీ యొక్క విలువ తెలిసి ఉండేది. డబ్బులకు పదవులు అమ్ముకున్న వ్యక్తి. అసలైన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై ఉద్యమ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించిన ఘనుడు. ఇతనిని ఇలాగనే జిల్లా అధ్యక్షుడిగా కొనసాగితే ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవ్వడం ఖాయం. తాతా మధు తన సొంత కోటరిని ఏర్పరచుకొని ప్రతి పథకంలో కమీషన్లను వాళ్ళ అనుచరుల ద్వారా తీసుకునే వ్యక్తి. దయచేసి అధిష్టానం గమనించి ఎలక్షన్ ముందే జిల్లా అధ్యక్షుడు మారవాలని కోరుతున్నాను.

## చెట్టు కింద సేదతీరుతున్న జీవాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** మండే ఎండలకు మండల పరిధిలోని మేకలు, గొర్రెలు ఎండ వేడిమిని తట్టుకోలేక సాగు పొలాల్లో ఉన్న చెట్ల కింద జీవాలు సేద తీరుతున్నాయి. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, వెన్నవల్లి, బత్తులపల్లి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల, ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల తదితర గ్రామాలలో మండే ఎండలకు వేడిమిని తట్టుకోలేక చెట్ల నీడన ఉంటున్నాయి. ఈ విషయమై మండే ఎండలకు గొర్రెలు మేకలు పెంపకం దారులు వేసవిలో పలు సలహాలు సూచనలు పాటించాలని పశు వైద్యాధికారిని మమత సూచిస్తున్నారు.

## మాదారం రైల్వే సైడింగ్ కార్మికులు ఐఎఫ్‌టియులో చేరిక

**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం మాదారం స్టీల్ ప్లాంట్ రైల్వేసైడింగ్ కార్మికులు సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఐఎఫ్‌టియులో శుక్రవారం ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకూబ్‌షావలి భారత కార్మిక సమైక్య ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య సమక్షంలో చేరారు. మాదారం డోలమైట్‌లో కాంట్రాక్టర్ల రాజ్యం నడుస్తుందన్నారు. డోలమైట్ అధికారులు పర్యవేక్షణ కొరవడిందని, దీని మూలాన కార్మికులకు 26 మాస్టర్ల పనిదినంతో పాటు చట్టబద్ధ హక్కులు సౌకర్యాలు లీవ్‌లు లేకుండా కోల్పోయారన్నారు. కేవలం నెలలో 17 రోజులు మాత్రమే పనిదినం కాంట్రాక్టర్ ఇవ్వడం వలన కార్మికులు పూటగడవడమే కష్టంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పది మంది కార్మికులు సిఐటియు నుండి చేరడం అభినందనీయమన్నారు. చేరిన కార్మికుల్లో ఇస్లావత్ హుస్సేన్, షేక్ ఇబ్రహీం, జి.లక్ష్మీ నారాయణ, వి.కళావతి, బి.వీరన్న, ఎస్.ప్రసాద్, షేక్ నాగుల్‌మీరా, జి.రవికుమార్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు ఖమ్మం ఏరియా కార్యదర్శి కోయల శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపందా డివిజన్ నాయకులు గూగుల్ తేజ, సింగరేణి రిటైర్డ్ ఐఎఫ్‌టియు నాయకులు ధారావత్ సక్రు తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలి



**ప్రజాపక్షం/ మధిర :** రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నివాసముంటూ ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలని టిఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జివి.నాగేమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మధిరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిర లాంటి సరిహద్దు పట్టణాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులు నియోజకర్గ కేంద్రంలోని రిటర్నింగ్ అఫీసర్ వద్దకు వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందుల పడాల్సి వస్తుందన్నారు. రాష్ట విభజన అనంతరం ఎన్నికల సమయాల్లో సరిహద్దు ప్రాంతాల్లోని అనేక మంది ఉద్యోగులు గతంలో తమ ఓటును వినియోగించుకోలేకపోయారని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టిస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాగూర్‌వలీ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ రావిరాల లక్ష్మణ్‌రావు, మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వినోద్‌రావు, ఈ.వీరయ్య, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, కోశాధికారి బి.చెన్నయ్య, కార్యదర్శులు రాణి, ఎం.కళావతి, వి.కొండలరావు, భీమశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై దాడికి కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ఎన్నికల సమయంలో దాడి చేసేందుకు కుట్ర పన్నిన నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుమ్మల నాగేశ్వరరావు పై ఓ మాజీ అధికారి, ఓ ప్రముఖ వైద్యుడు కుట్ర పన్నారని వార్తా పత్రికల్లో కథనం వచ్చిందని ఈ కుట్రపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి అసలు సూత్రదారులను గుర్తించి వారికి కఠిన శిక్షలు విధించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావిద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రెండో రోజూ ఒక నామినేషన్ దాఖలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి రెండో రోజు ఒక నామినేషన్ దాఖలైంది. శుక్రవారం ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన తాండ్ర వినోద్ రావు బిజెపి అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో బిజెపి నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## హెలికాప్టర్‌ను తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం ఖమ్మంజిల్లాకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. శుక్రవారం కేంద్ర మంత్రి రాజ్‌నాధ్ సింగ్ ఖమ్మం నగరంలో బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ రోడ్డు షో నిర్వహించారు. కేంద్ర మంత్రి ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

**ప్రజాపక్షం/ మధిర :** ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సైదులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని దెందుకూరు పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్‌ను పిహెచ్‌సిలో అందు తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మడుపల్లి బస్తీదవఖానాను కూడా సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపి సేవలు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని , టార్గెట్ అచ్చువ్‌మెంట్స్‌ను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రొగ్రాం ఆఫీసర్ నిలోహనా, ఆరోగ్యశాఖ జిల్లా మాస్ మీడియా అధికారి కాసినాధ్, పారామెడికల్, స్టాఫ్ వర్కర్లు, ఎఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



## కనకపూడి శ్రీను మృతికి సిపిఎం నివాళి

**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కనకపూడి శ్రీను(45) గత కొంతకాలంగా గుండెసంబంధిత వ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని సిపిఎం పార్టీ రాష్ట్రకమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకపూడి శ్రీను పార్టీకి నమ్మకమైన నాయకుడిగా పనిచేశాడని, పేదల పక్షాన పోరాడే ఎర్రజెండా కోసం తుదిశ్వాస వరకు పోరాడారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దెల ప్రభాకర్, సిఐటియు నాయకులు మధు, చారి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నామను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: ఖమ్మం పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు, ఉద్యమ కారుడు పాలకుర్తి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోక లపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి చెందిందని అన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఇబ్బందులు పడుతుందని ప్రజలు గమనించాలని సూచించారు. నామా నాగేశ్వరరావు గెలుపు కోసం ప్రతి కార్యకర్త అహర్నిశలు కృషి చేయాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల్లో పర్యటించిన జేసీ



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలో శుక్రవారం జేసీ డి వేణుగోపాల్ ఆకస్మికంగా పర్యటించారు. ఈసందర్భంగా మండలంలోని సుబ్బనపల్లి, కేఈవీ రామవరం, చాపరాలపల్లి గ్రామాలలో ఉన్న ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలలో వసతులను, సౌకర్యలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ భారతి , ఎంపిడివో పుల్లారావు, ఆర్ఐ తారా చందు, వివిధ శాఖల అధికారులు సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చర్యలు



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని మూకమామిడి గ్రామ పంచాయితీలో వలస ఆదివాసీ వెనుగప్పనగర్ నందు వాటర్ టిన్ల ద్వారా త్రాగునీటి సరఫరా చేసే చర్యలు తీసుకుంటున్నామని ఎంపివో లక్ష్మయ్య తెలిపారు. అదే విధంగా సాయిరాంపురంలో కొత్త మోటార్ కొనుగోలు చేసి , త్రాగునీటి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ గ్రామ పంచాయితీల పరిధిలోని త్రాగునీటి సమస్యను లేకుండా చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఎస్ ఈకో మోటార్స్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్ఎస్ ఈకో మోటార్స్ షోరూంను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఇల్లందు రోడ్డు గణేష్ గార్డెన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ఈకో మోటార్స్ షోరూంను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ షోరూం వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొనాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, మలీదు జగన్, లకావత్ సైదులు, తుపాకుల యలగొండ స్వామి, మారం కరుణాకర్‌రెడ్డి, మందడపు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న మంచినీరు



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీలోని మధిర విజయవాడ రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదురుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి మంచినీరు వృధాగా పోతుంది. ప్రస్తుత వేసవికాలంలో కూడా నీరు వృధాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గత నాలుగైదురోజుల నుండి ఎండలు విఫరీతంగా పెరిగిన నేపథ్యంలో నీటి కొరత ఏర్పడే పరిస్థితుల్లో పైపులైన్ లీకేజితో మంచినీరు వృధాగా పోతుండటంతో పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి మంచినీరు వృధాగా పోకుండా పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## గురుకుల ఫలితాల్లో సిపిఎస్ వైరా గుట్టబడి విద్యార్థుల ప్రభంజనం

**ఉపాధ్యాయుడు నాగబత్తిని భాస్కర్‌రావుకు అభినందనలు**



ప్రజాపక్షం/వైరా: సిపిఎస్ వైరా గుట్టబడి విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడంలో సిపిఎస్ వైరా గుట్టబడి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కనీవిని ఎరగని ఫలితాలు అందరి విద్యార్థులకు కోరుకున్న చోట పాఠశాలలో సీట్లు లభించాయి. పాఠశాలలో మొత్తం 41మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 37మంది అత్యధిక మార్కులతో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగబత్తిని భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు గృహలక్ష్మి, శ్రీనివాసచారి, విజయకుమారి పిల్లలకు స్వీట్లు తినిపించి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల వాతావరణం అంతా ఆనందంతో హర్షధ్వానాలతో పండుగ వాతావరణం తలపించేలా ఉంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు నాగబత్తిని భాస్కర్‌రావును విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రజలు అభినందించారు.

## సన్మార్గమే మత గ్రంథాల సారాంశం



ప్రజాపక్షం/సత్తుపల్లి: సన్మార్గమే మత గ్రంథాల సారాంశం మని జమాతే ఇస్లామి హింద్ మండల అధ్యక్షుడు మున్వర్ ఖాన్ అన్నారు. అన్ని మతాల్లోనూ భయ, భక్తులు కల్పించేందుకు నియమ నిబంధనలు ఉపవాసాలు ఉంటాయన్నారు. శుక్రవారం విశ్వశాంతి విద్యాలయంలో జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ పండుగ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని మతాల మనోభావాలను పంచు కునేందుకు ఈ నెల 21 రాత్రి 7 గంటలకు డాల్ఫిన్స్ స్విమ్మింగ్ పూల్ ఎదర గల తమ ప్రాంగణంలో సమావేశం జరగనున్నట్టు తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి, జమాతే ఇస్లామీ హిందూ మహిళా విభాగం జిల్లా బాధ్యులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు దవులత్ ఉన్నేసాబేగం, రీనా, విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం..



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి ప్రధాత, ఉమ్మడి ఖమ్మం జిల్లా పెద్ద దిక్కు, రైతుల పక్షపాతి, రాష్ట్ర ప్రజల ఆరాధ్యుడైను తుమ్మలపై దాడి కుట్ర చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాయం రామనర్సయ్య, మొహమ్మద్ అతహార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంత మంది అరాచకులు తమ యొక్క అరాచకాన్ని ప్రదర్శించి భయోత్సాతాన్ని సృష్టించి అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకోవడం కల అని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ముఖ్యంగా ఏజెన్సీ మండలాల ప్రజలకు అభివృద్ధి ప్రధాతను ఎలా కాపాడుకోవాలో తెలుసన్నారు. ఒకప్పుడు 1984నుంచి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తుంటే ఆనాటి కొన్ని పార్టీలు, ప్రజాసంఘాలు సైతం తుమ్మలకు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. ఇవ్వాల కొంత మంది అరాచకులు చేసే అరాచకాలకు భయపడేది లేదన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర వెంకన్న, సిరినోముల శ్రీనివాసరావు, తాళ్లపల్లి వెంకన్న, బూరుగడ్డ నాగేష్, తులం ముత్తిలింగం, కరకపల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ప్యానల్ టీం

**బోధన అధ్యాయం రికార్డులు పరిశీలన**



ప్రజాపక్షం/కరకగూడెం: ఆశ్రమ పాఠశాలను గిరిజనాభివృద్ధి సంస్థ ప్యానెల్ టీంను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు జగన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఏడుగురు సభ్యులకు కలిగిన టీం ఆశ్రమ పాఠశాలలోని ప్రతి తరగతి ఉపాధ్యాయుల పనితీరును వారు రికార్డులను వ్యక్తిగత అధికారులను పరిశీలించారు. తెలుగు, ఆంగ్లము, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రము, గణితశాస్త్రం, హిందీ, సంబంధిత అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించి వారి వ్యక్తిగత రికార్డులను పరిశీలించారు, సైన్స్ ల్యాబ్ ను పరిశీలించి సైన్స్ ల్యాబ్ లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో వారికి అందించే విద్య తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరమైన విద్యను అందించే లక్ష్యంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ముందుకు వెళ్లాలని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎండిపోతున్న చెరువులు



ప్రజాపక్షం/కారేపల్లి: వర్షాభావానికి తోడు ఎండల తీవ్రతతో కారేపల్లి మండలంలో పలు చెరువుల్లో నీరు అడుగంటి నెర్రెలు బారుతున్నాయి. సాగునీటి కొరతతో రైతులు ఇప్పటికే ఆశలు వదిలేసుకున్నారు. చెరువులో ఉన్న కొద్దోగొప్ప నీటితో చేపలు బ్రతుకుతాయని ఆశిస్తున్న మతస్యకారులకు నిరాశే ఎదరవుతుంది. చెరువులు ఎండి లక్షల్లో చేపలు మృత్యువాత పడుతుండడంతో ఉపాధి లేదని వారు ఆందోళన చెందుతున్నారు.

## గురుకుల కళాశాల ప్రవేశం కొరకు దరఖాస్తులు

ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర గురుకుల కళాశాల, విద్యాలయం బాలికల వైరా ఖమ్మం జిల్లా వారి ఆహ్వానం తెంగాణ రాష్ట్ర గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఇంగ్లీష్ మీడియం, ఎంపిసి, బైపిసి, ఎంఈసి గ్రూపుల్లో చేరుటకు ప్రవేశ పరీక్ష టిఎస్ఆర్‌జెసి సెట్ 21న జరుగుతుని తెలియజేస్తూ ఇతర వివరాలకు హెచ్‌టిటిపిః//టిఎస్ఆర్‌జెడిసి.సిజిజి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. వివరాలకు 04024734899, 9490967222, 8008118813 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

## ప్రమాదాలకు నిలయంగా ఆర్‌ఓబి







**-లైటింగ్ సౌకర్యంలేక తీవ్ర ఇక్కట్లు**
**-కూడలిలో రింగ్ ఏర్పాటు చేసేదెన్నడు?**

ప్రజాపక్షం/బోనకల్: మండల కేంద్రంలోని ఆర్వోబి ప్రారంభంలో శ్రీ దుర్గా పిక్చర్ కూడలి వద్ద రెండు సర్వీసు రోడ్లు ఒకే చోట్ల కలుస్తుండడంతో ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో అన్ని వాహనాలు ఒకే చోట కలుస్తుండడంతో అనేక ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచే రింగ్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆర్వోబి విద్యుత్ సౌకర్యం లేకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారణమైంది. దీనికి తోడు ఖమ్మం రోడ్డుకు ఇరువైపులా ఆగిన వాహనాలు, చిరువ్యాపారుల తోపుడు బండ్లు, ఇతరత్ర వాహనాలు ఆపడంతో మరింత ఇరుగ్గా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖమ్మం రోడ్డుకు బోనకల్ గ్రామ పంచాయతీ బోర్డు అడ్డుగా ఉండడంతో ఇరువైపులా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అర్అండ్‌బి, పోలీసు అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించవల్సిందిగా మండల వాసులు కోరుతున్నారు.

**ఆర్వోబి రింగ్ ఏర్పాటు చేయాలి : సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**



బోనకల్ రైల్వే గేటు వద్ద గతంలో గంటల తరబడి వాహనాలు నిలిచి పోతున్నాయని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అప్పటి ప్రభుత్వం 2008లో ఆర్వోబి నిర్మాణం చేశారు. నాటి నేటి నుండి వరకు ఆర్వోబి సమస్యలకు నిలయంగా మారింది. విద్యుత్‌దీపాల సౌకర్యం, మెట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరుతున్నాం. రానున్న రోజుల్లో ఆర్వోబి సమస్యల పరిష్కారం కోసం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తాం.

## ప్రమాదకరంగా జాతీయ రహదారి

**-నిర్లక్ష్యం నీడలో శ్రీ లక్ష్మి మెడల్ ఇండస్ట్రీస్**





ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డి పల్లి మండల పరిధిలో ఉన్నటువంటి పెనుబల్లి మండలం అన్నపురెడ్డిపల్లి మండలం సరిహద్దు ప్రాంతంలో జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారికి కూత వేటు దూరంలో శ్రీ లక్ష్మి మెటల్ ఇండస్ట్రీస్ అనే సంస్థ గుట్టని తొలచి క్వారీ తవ్వుతున్నారు. ఈ క్రమంలో గుట్ట నుంచి వస్తున్న భారీ వాహనాల నుంచి జారీపడుతున్న గులికరాళ్లు జాతీయ రహదారికి అడ్డంగా పడి ఉన్నాయి. ఈప్రాంతం దగ్గర మూల మలుపు ఉండటం వలన రహదారిపై వచ్చేటువంటి వాహనాలకు ఈ గులికరాళ్లు అడ్డుగా ఉండి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాహనదారులు చెబుతున్నారు. ప్రతి రోజు ఈ రాళ్ళను తొలగించే బాధ్యత శ్రీ లక్ష్మి మెటల్ ఇండస్ట్రీ యాజమాన్యం వారే చేసుకోవాలని, అదే విధంగా దుమ్ము లేవకుండా ఈ ప్రాంతంలో నీళ్లను కూడా ప్యూరిపైయింగ్ చేయవలసి ఉంటుంది. ఇటువంటి చర్యలు ఏమి చేపట్టకుండా నిర్లక్ష్యం నీడలో నిద్రపోతున్నారు. ఇటు క్వారీ నుంచి బయటకు వచ్చే భారీ వాహనాలతో వస్తున్న దుమ్ముతోను రోడ్డుపై పడి ఉన్న గులికరాలతోనూ ఎప్పుడు ఏం జరుగుతుందో అని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాళ్ల క్వారీ నుంచి వచ్చే దుమ్ము కానీ జారిపేడ రాళ్లను కానీ జాతీయ రహదారిపై అడ్డుగా లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## వజ్ర తేజ రైస్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్: పట్టణ పరిధిలోని బాలాజీ థియేటర్ ఎదురుగా కందుకూరు గ్రామ వాసి పెద్దలు కాటేపల్లి దుర్గారావు నూతన ''వజ్ర తేజ'' రైస్ షాప్ ను శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి వ్యాపార అభివృద్ధి చెందాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన రాములునాయక్



ప్రజాపక్షం/వైరా: వైరా నియోజకవర్గం నుంచి 2018 ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి లావుడ్యా రాములునాయక్ అప్పటి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీకి, తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.

## వధూవరులను ఆశీర్వదించిన మెచ్చా



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట మండల పరిధిలోని మొద్దులగుడెం గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త మాగంటి మల్లేష్ కుమార్తె వివాహ వేడుకలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన జెడ్‌పిటిసి శ్రీలత



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక గ్రామంలోని ఐటిసి సత్యనారాయణస్వామి ఫంక్షన్ హాల్ నందు దాసరి విజయ్‌కుమార్ వెడ్స్ స్వప్నల వివాహ వేడుకకు జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో సారపాక బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు చుక్కపల్లి బాలాజీ, పినపాక నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లకోటి పూర్ణచందర్‌రావు, బిఆర్ఎస్ పార్టీ టౌన్ యువజన విభాగం అధ్యక్షులు సోము లక్ష్మి చైతన్యరెడ్డి, యూత్ నాయకులు పంగి సురేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటిసి మరింత అభివృద్ధి చెందాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐటిసి లిమిటెడ్ పిఎస్‌పిడి యూనిట్ కర్మాగారానికి నూతన అధినేతగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన యూనిట్ హెడ్ ప్రణవ్ శర్మని ఐటిసి పిఎస్‌పిడి శ్రేయోభిలాషి, తెలంగాణ రాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ డా బుసిరెడ్డి శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రణవ్ శర్మను భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దృశ్యాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ప్రణవ్ శర్మ నేతృత్వంలో కర్మాగారం మరింత అభివృద్ధి చెందాలని, మరింతగా విస్తరించాలని, స్థానికులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కలుగాలని ఆకాంక్షించారు.

## వైభవంగా కోదండ రామాలయ శంకుస్థాపన



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని గుర్రంగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయ శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి వేదపండితులు వివిఆర్‌కె మూర్తి ఆధ్వర్యంలో పండితులు వేద మంత్రాల మంత్రోత్సవ నడుమ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తులతో పాటు, చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామంలో ఎటువంటి సమస్య లేదు



ప్రజాపక్షం/చంద్రుగొండ:గొత్తికోయలకు మంచినీటి సమస్య ఏర్పడిందని ప్రజాపక్షంలో వచ్చిన కథనానికి ఎంపిడివో అశోక్ శుక్రవారం స్పందించారు. ఈసందర్భంగా ఆయన ప్రజాపక్షంతో మాట్లాడారు. గ్రామంలో సందర్శించడం జరిగిందని, అక్కడ త్రాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు. అక్కడ మంచినీటి సమస్య ఏర్పడలేదని గుత్తికోయలు నీటిని తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. బెండాలపాడు గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో గుత్తికోయలు నివాసం ఉంటున్నారని, వారు బృహత్తర పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి నీటిని తీసుకెళ్తున్నారని, చేతి పంప్‌ను ఏర్పాటు చేయటానికి అటవీ శాఖ అధికారులు అనుమతులు లేకపోవడంతో పల్లె ప్రకృతిలో ఏర్పాటు చేసిన బోరు నుంచి నీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనుమతి వచ్చిన వెంటనే చేతి పంప్‌ను ఏర్పాటు చేయిస్తామని అన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం

**-సుమారు రూ. పది లక్షలకు పైగా పంటనష్టం**





ప్రజాపక్షం/గుండాల : మండల పరిదిలోని పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తొమ్మిది మంది రైతులకు సంబందించిన మొక్కజొన్న పంట చేను శుక్రవారం ఎరగడిమంటల కారణంగా, లేక విద్యుత్ మోటార్ శాట్ సర్కిట్ కారణంగా సుమారు 20 ఎకరాలు పంట అగ్నికి ఆహుతి అయిన సంఘటన జరిగింది. ఆరుగాలం శ్రమించి చేతికి అందే దశలో పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు బోరున విలపించారు. పంటతోపాటు విద్యుత్ మోటర్ల అమర్చే ప్లాస్టిక్ పైపులు సైతం కాలి పోవడంతో వారివేదన వర్ణనాతీతంగా మారింది. నష్టపోయిన రైతులలో జోగసారయ్య, వూకె నర్సయ్య, చిన్న పగడయ్య, జోగ రవిందర్, వాగబోయిన మోహన్ రావు, పెండెకట్ల పెంటయ్య, నాగలక్ష్మి ఉన్నారు. పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పిటిసి రామక్క, ఎంపిపి సత్యం, మాజి సర్పంచి సీతారాములు కోరారు.